## క్లుప్తంగా

### ఐడీ కార్డుల పంపిణీ



ఐడీ కార్డులు పంపిణీ చేస్తున్న రిటైర్డ్ ఏఎస్‌ఐలు

**న్యాల్‌కల్(జహీరాబాద్):** అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకొని ప్రయోజనం పొందాలని రిటైర్డ్ ఏఎస్‌ఐలు సురేష్, మల్లికార్జున్ విద్యార్థులకు సూచించారు. మండలంలోని రేజింతల్ పాఠశాల విద్యార్థులకు సొంత డబ్బుతో చేయించిన స్టూడెంట్ ఐడీ కార్డులు, ఇతర సామగ్రిని గురువారం పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ .. విద్యాభివృద్ధికి ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని, వాటికి తోడు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎస్‌ఐ ప్రభాకర్‌రావు, హెచ్‌ఎం గురునాథ్, ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, సంగమేశ్వర్, సరిత, క్రిష్ణ, నరేందర్, శ్వేత పాల్గొన్నారు.

### పంటల పరిశీలన



పెసర పంటను పరిశీలిస్తున్న ఏఓ

**న్యాల్‌కల్(జహీరాబాద్):** మండలంలోని హుమ్నాపూర్ గ్రామ శివారులో రైతులు సాగు చేసిన పెసర, మినుము పంటలను బుధవారం మండల వ్యవసాయ శాఖ అధికారి అభినాష్ వర్మ పరిశీలించారు. అధిక దిగుబడి ఇచ్చే నాణ్యమైన పెసర, మినుము విత్తనాలను ప్రభుత్వం ఇటీవల రైతులకు ఉచితంగా పంపిణీ చేసింది. వాటిని రైతులు సాగు చేశారు. ప్రస్తుతం అవి ఆశాజనకంగా ఉన్నట్లు ఏఓ తెలిపారు. పంట చేతికి వచ్చిన తర్వాత ఆ విత్తనాలను ఇతర రైతులకు అందించాలని ఏఓ సూచించారు. పెసర, మినుము పంటలతో పాటు పత్తి పంటను కూడా పరిశీలించి తగు సూచనలు చేశారు. ఆయన వెంట ఏఈఓ సాయిలు ఉన్నారు.

### కలుపు నివారణ చేపట్టాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

**నారాయణఖేడ్:** పత్తి పంటలో కలుపు నివారణ దశలవారీగా చేపడితే మొక్కల ఎదుగుదలకు తోడ్పడి దిగుబడి అధికంగా వస్తుందని ఖేడ్ ఏడీఏ నూతనకుమార్ సూచించారు. గురువారం చాప్టా(కె) శివారులో సాగు చేసిన పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు నుంచి నాలుగు ఆకుల దశలో 15 నుంచి 45 రోజుల వరకు చాలా జాగ్రత్తగా కలుపునివారణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం పత్తికి పేనుబంక, తెల్లదోమ, పచ్చదోమ, పిండినల్లి ఆశించిందని చెప్పారు. నివారణ చర్యలను రైతులకు అవగాహన కల్పించారు.

### మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న రాములు

**జహీరాబాద్ టౌన్:** మాజీ కౌన్సిలర్, కాంగ్రెస్ నాయకులు రాములు నేత పట్టణంలోని శాంతి నగర్‌లో ఇంటింటికి వెళ్లి మొక్కలు పంపిణీ చేశారు. శాంతినగర్‌లోని 11వ వార్డులో మహిళా సంఘాలతో కలిసి రాములు నేత ఇంటింటికి వెళ్లి పూలు, పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. ఇంటి పరసరాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు పద్మమ్మ, వహిదా బేగం, ఆర్‌పీ. వరలక్ష్మి, మాధవి పాల్గొన్నారు.

### భవన నిర్మాణానికి భూమిపూజ

**నారాయణఖేడ్:** పట్టణ శివారులో జంగమ సమాజ భవన నిర్మాణానికి గురువారం కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్య భూమిపూజ చేశారు. భవన నిర్మాణ పనులను ఏడాదిలోపు పూర్తి చేయాలని స్థానిక జంగమ సమాజం బాధ్యులకు సూచిస్తూ భవన నిర్మాణం కోసం వనవంతుగా రూ.51 వేలను విరాళంగా అందజేశారు. రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ భిక్షపతి, ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి సతీమణి అనుపమారెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు సుధాకర్ రెడ్డి, వివిధ ఆశ్రమాల పీఠాధిపతులు వర్షి స్వామి, మణికంఠస్వామి, జంగమసమాజం బాధ్యులు పాల్గొన్నారు.

# బూచినెల్లి.. రోడ్డు చూడతరమా!

- పూర్తిగా ధ్వంసమైన రహదారి
- నిత్యం అవస్థలు పడుతున్న జనం
- స్థానిక ఎన్నికలు బహిష్కరిస్తామంటున్న గ్రామస్తులు



గుంతలు పడి దెబ్బతిన్న బూచినెల్లి రోడ్డు నీరు

**జహీరాబాద్ టౌన్:** నియోజకవర్గంలోని పలు గ్రామాల పంచాయత్‌రాజ్ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా మండలంలోని బూచినెల్లి గ్రామ రోడ్డు పూర్తిగా దెబ్బతిని ప్రజలు నరకం చూస్తున్నారు. రోడ్డు పొడువు గుంతలు, బురదయమంగా తయారై ప్రమాదాలకు నిలయంగా మారింది.

ప్రభుత్వాలు మారినా.. మారోడ్లు మారడం లేదు.. ప్రభుత్వాలు మారిన మా గ్రామ రోడ్లు బాగు చేయడం లేదని బూచినెల్లి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. జహీరాబాద్ పట్టణానికి ఐదారు కిలోమీటర్ల దూరంలో ఉన్న బూచినెల్లి గ్రామం ఉంది. కూలీ పనులతో పాటు ఉద్యోగాలు చేసే వారు సామాన్య ప్రజలు ప్రతి రోజు పట్టణానికి వస్తుంటారు. బూచినెల్లిలో ప్రాంతంలో పరిశ్రమలు కూడా ఉండడంతో కార్మికుల రాకపోకలు సాగిస్తుంటారు. జాతీయ రహదారి నుంచి గ్రామం వరకు గల రోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా తయారైంది. రాకపోకలతో రద్దీగా ఉండే రోడ్డు అధ్వానంగా మారడంతో ప్రజలు నరకం చూస్తున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రోడ్డు మరమ్మతులకు రూ.2.11 కోట్ల నిధులు మంజూరైనా సకాలంలో మరమ్మతులు చేపట్టనందున నిధులు రద్దు అయ్యాయి. గుంతల కారణంగా వర్షాకాలంలో నీరు పేరుకుని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చినుకుపడుతే చాలు బురదమయంగా తయారవుతుంది. దీంతో మోటారు బైక్‌లు అదుపుతప్పి జారీ పడుతున్నాయి. ప్రమాదాల కారణంగా ఎంతో మంది గాయపడ్డారు. పంచాయతీ రాజ్ శాఖ అధికారులు స్పందించి దెబ్బతిన్న బూచినెల్లి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

> **స్థానిక సంస్థల ఎన్నికలు బహిష్కరిస్తాం**
>
> జాతీయ రహదారి నుంచి గ్రామం వరకు గల రోడ్డు పూర్తిగా దెబ్బతిని ప్రతి రోజు నానా అవస్థలు పడుతున్నాం. వర్షం కురిసినప్పుడు ఎక్కడ గుంతలు ఉన్నవి తెలియక పడిపోతున్నాం. రోడ్డు మరమ్మతుల కోసం ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారు కరువయ్యారు. రోడ్డును బాగు చేసే వరకు స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తాం. ఇదే విషయమై త్వరలో ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తాం.
>
> –శ్రీనివాస్, బూచినెల్లి

# తురంకుంటలో వ్యర్థ జలాలు ప్రవాహం



తురంకుంటలో ప్రవహిస్తున్న వ్యర్థజలాలు

**జిన్నారం(పటాన్‌చెరు):** గడ్డపోతారం పట్టణ పరిధిలోని తురంకుంట గండి కాల్వలో కాలుష్య జలాలు పారుతున్నాయి. గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని పలు పరిశ్రమలు బుధవారం కురిసిన వర్షం నీటితో కలిపి రసాయన వ్యర్థ జలాలు తురుంకుంటలోకి వదిలారు. ఎర్రటి రంగులోని నీరు భారీగా కాల్వల ద్వారా వదిలారు. దీంతో స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్థ్యజలాలు మల్లం చెరువులోకి చేరడంతో చెరువు కలుషితం అవుతుందని, వర్షాకాలం ప్రారంభంలోనే ఇలాంటి పరిస్థితులు నెలకొంటే రానురాను తీవ్రస్థాయికి చేరే ప్రమాదం ఉందని ఆ ప్రాంత రైతులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. పీసీబీ అధికారులు నిర్లక్ష్యం వదిలి పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### కొసాగుతున్న వందరోజుల ప్రణాళిక

**జిన్నారం (పటాన్‌చెరు):** బొల్లారం మున్సిపాలిటీలో వంద రోజుల ప్రణాళిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గురువారం తడి పొడి చెత్త సేకరణ, పిచ్చి గడ్డి మొక్కలు తొలగించారు. నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో దోమల నివారణ చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి చంద్రశేఖర్ పాల్గొని పరిశీలించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

### మాజీ సర్పంచ్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న మంత్రి దామోదర

**జోగిపేట(అందోల్):** జోగిపేట మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ వర్థంతిని గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సి.దామోదర రాజనర్సింహ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సర్పంచ్‌గా ఆయన జోగిపేట పట్టణాభివృద్ధికి చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో రాజనర్సింహ ఫౌండేషన్ చైర్మన్ త్రిష రాజనర్సింహ, మాజీ మున్సిపల్ చైర్మన్ జి.మల్లయ్య, మాజీ కౌన్సిలర్లు సురేందర్‌గౌడ్, డి.శంకర్, లక్ష్మణ్, చందర్ నాయక్, మాజీ ఎంపీటీసీ డి.వెంకటేశం, నాయకులు డి.శ్రీనివాస్, ఖాజా, డి.శేఖర్, సందీప్‌గౌడ్ పాల్గొన్నారు.

### నాగుపాము కలకలం

**జహీరాబాద్:** పట్టణంలోని అతిథి హోటల్ ఎదుట 65వ జాతీయ రహదారిపై గురువారం నాగుపాము కలకలం రేపింది. దారిన వెళ్లే వారు పామును చూసి భయపడ్డారు. వాహనాలను పక్కనుంచి తీసుకెళ్లారు. పాము ప్రత్యక్షం కావడంతో జనం పెద్ద సంఖ్యలో గుమికూడారు. అయినా పాము అక్కడి నుంచి కదలలేదు. పడగ తీసి ఉండిపోయింది. దీంతో పాములను పట్టే వ్యక్తి పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలాడు.

### సేవలు గుర్తుంటాయి

**నారాయణఖేడ్:** ఉద్యోగులు విధినిర్వహణలో భాగంగా అంకిత భావంతో చేసే సేవలకు ప్రజల్లో ఎల్లప్పుడు గుర్తింపు ఉంటుందని ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న మొగులయ్య పదవీ విరమణ సందర్భంగా గురువారం మొగులయ్యని సన్మానించి జ్ఞాపకను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. మొగులయ్య 37 ఏళ్ల విధి నిర్వహణలో ఎలాంటి తప్పులు చేయకుండా మన్ననలు పొందారన్నారు. సహాయ మేనేజరు నర్సింలు, మెకానికల్ ఇంజనీరు దశరథరావు, సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నందులాల్ పాల్గొన్నారు.

### అంకిత భావంతో పనిచేయాలి

**సదాశివపేట రూరల్(సంగారెడ్డి):** ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులంతా బాధ్యతగా, అంకిత భావంతో పనిచేయాలని ఎంఈఓ శంకర్ సూచించారు. గురువారం మండలంలోని ఆత్మకూర్ ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు హాజరై మాట్లాడారు. వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకొని ఉత్తమ విద్యాబోధన ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులను తయారు చేయడంలో ఉపాధ్యాయులు పని చేయాల న్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం స్వరూప రాణి, సీఆర్పీలు రాజేశ్వర్, మల్లేశం, నాగేష్, స్కూల్‌కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అమరుడు ఇషాన్‌రెడ్డికి నివాళి



నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

**న్యాల్‌కల్(జహీరాబాద్):** న్యాల్‌కల్ మండలం బసంత్‌పూర్ గ్రామానికి చెందిన తెలంగాణ అమరవీరుడు ఇషాన్‌రెడ్డికి బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. గురువారం మండలంలోని మల్గి గ్రామ బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఇషాన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగం చేశారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మారుతి, మాజీ ఎంపీటీసీ శివానంద, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు సిద్ధారెడ్డి, నాయకులు శాంతకుమార్, గణపతి పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్‌తో లబ్ధి

**పటాన్‌చెరు టౌన్:** నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో సీఎం సహాయనిధి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. రామచంద్రపురం డివిజన్ పరిధిలోని మయూరినగర్ కాలనీకి చెందిన భిక్షపతి అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఎమ్మెల్యే సహకారంతో సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. చికిత్స నిమిత్తం రెండు లక్షల రూ.50 వేల ఎల్‌ఓసీ మంజూరయింది. ఈ మేరకు గురువారం భిక్షపతి కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీ అనుమతి పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు.



ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

**సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ**

**జహీరాబాద్ టౌన్:** పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్ నాయకులు పలువురి లబ్ధిదారులకు రూ.3.39.500 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. పట్టణంలోని అల్లీపూర్‌కు చెందిన లలితకు రూ. 55 వేలు, గిరి శంకర్‌కు రూ. 33 వేలు, ఇస్మాయిల్‌కు రూ. 60 వేలు,రాంనగర్‌కు చెందిన ఎండీ.సాదక్‌కు రూ. 29.500 వేలు, రాచన్నపేటకు చెందిన వెంకటయ్యకు రూ.19వేలు, హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన సోమశేఖర్‌కు రూ.11.500 వేలు, రంజోల్‌కు చెందిన కళావతికి రూ.11,500 వేలు, అంబికకు రూ. 9 వేలు ఆర్యనగర్‌కు చెందిన ఫాతిమాకు రూ.13.500 వేలు, పాండురంగ వీధికి చెందిన అమీనాకు రూ. 16 వేలు, మాణిక్‌ప్రభు వీధికి చెందిన రాంరెడ్డికి రూ. 21 వేలు, హోతి(కె)కు చెందిన బేగంకు రూ. 60 వేల చెక్కులను మాజీ కౌన్సిలర్ నామ రవికిరణ్ తదితరులు అందజేశారు.

# ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది

ఎంఈఓ బస్వరాజ్

**జహీరాబాద్:** భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేదే ఉపాధ్యాయ వృత్తి అని.. ఈ వృత్తి ఎంతో పవిత్రమైనదని ఎంఈఓ మాణయ్య అన్నారు. గురువారం పట్టణంలోని నంబర్–3 పాఠశాల ఉపాధ్యాయురాలు బి.సరస్వతి పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పదవీ విరమణ అనేది ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి సహజం అన్నారు. విధి నిర్వహణలో అందించిన సేవలే ప్రజల్లో గుర్తుండిపోతాయన్నారు. ఉపాధ్యాయురాలు సరస్వతీ మూడున్నర దశాబ్దాల కాలంగా అంకితభావంతో సేవలందించి ఎంతో మంది విద్యార్థులను తీర్చి దిద్దిందన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు ఆమెను శాలువా, పూల మాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బి.శంకరయ్య, వెంకటస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ వెంటనే పెన్షన్ పత్రాలు



పీపీఓ పత్రాలను అందజేస్తున్న విశాల్ అగర్వాల్

ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ విశాల్ అగర్వాల్

**పటాన్‌చెరు టౌన్:** పదవీ విరమణ పొందిన నెలలోనే పెన్షన్ ప్రయోజనాలు పొందేలా లక్ష్యం పెట్టుకున్నామని ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ విశాల్ అగర్వాల్ అన్నారు. జూలైలో పదవీ విరమణ పొందిన 104 మంది చందాదారులకు పీపీఓలను జారీ చేసి.. 30 మందికి గురువారం అందజేశారు. విశాల్ అగర్వాల్ మాట్లాడుతూ.. పదవీ విరమణ పొందిన నెలలోనే చందాదారులకు పీపీఓలను జారీ చేయనున్నట్లు చెప్పారు. అనంతరం లబ్ధిదారులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ – 2 ప్రశాంత్ ప్రియదర్శి, అకౌంట్ ఆఫీసర్ అబ్దుల్ అజీమ్ ఉన్నారు.

# దోమల నుంచి పశువులను కాపాడాలి

జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వసంతకుమారి



గొర్రెలకు నట్టల మందులు వేస్తున్న పశువైద్యులు

**హత్నూర( సంగారెడ్డి):** వర్షాకాలంలో పశువులను దోమల నుంచి రక్షించుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వసంతకుమారి అన్నారు. గురువారం హత్నూర మండలం రెడ్డి ఖానాపూర్‌లో సత్యసాయి సేవా సమితి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పశువుల పాక సమీపంలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. పశువులను వర్షాకాలంలో దోమలు బారి నుంచి కాపాడాలని లేకుంటే పశువులు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ఆగస్టు 8 వరకు జిల్లా వ్యాప్తంగా నీలి నాలుక టీకాలను గ్రామాల్లో క్యాంపుల ద్వారా వేస్తున్నట్లు తెలిపారు. గొర్రెల కాపరులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య శిబిరంలో 980 గొర్రెలు మేకలకు నట్టల నివారణ మందులు నీలి నాలుక టీకాలు వేసినట్లు చెప్పారు. 20 పశువులకు గర్భకోశ చికిత్సలు చేశారు. 25 దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ సహాయ సంచాలకులు డాక్టర్ పున్నయ్య, సత్య సాయి సేవ సమితి ప్రతినిధులు పార్థసారథి, ఈశ్వర, హత్నూర మండల పశు వైద్యాధికారులు హేమలత, సంధ్యారాణి, ఇబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# అనుమతిలేని వెంచర్లపై చర్యలు తీసుకోండి

**నారాయణఖేడ్:** అనుమతులు లేకుండా ఖేడ్, నాగలిగిద్ద, కంగ్టి మండలాల్లో ఫాంలాండ్స్ పేరిట వెంచర్లు వేసి విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గురువారం సీపీఎం ఆధ్వర్యంలో ఖేడ్ సబ్ కలెక్టర్ కార్యాలయ డీఏఓ అనితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ ఖేడ్ డివిజన్ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ.. రైతుల వద్ద తక్కువ ధరకు భూములు కొని నాలా కింద మార్చకుండానే అనుమతులు లేకుండా వెంచర్లు వేసి గుంటల చొప్పున విక్రయిస్తుండటంతో ఓవైపు ప్రభుత్వం ఆదాయం కోల్పోతుండగా మరోవైపు కొన్న స్థలం ఎక్కడుందో తెలియక నష్టపోతున్నారని తెలిపారు. నాయకులు అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్డీఓ కార్యాలయం ముట్టడి




జహీరాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

**జహీరాబాద్ టౌన్:** పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజురియింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు డిగ్రీ కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆచార్య డిగ్రీ కళాశాల నుంచి ప్రధాన రహదారి గుండా ఆర్డీఓ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి, ధర్నా చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. రూ.7.200 కోట్ల ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. అందాల పోటీలకు ప్రభుత్వం రూ. 200 కోట్లు ఖర్చు చేసిందని, పేద విద్యార్థుల చదువుల కోసం నిధులు విడుదల చేయడంలేదని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యాపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, నిధులు విడుదల చేయకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు సందీప్, అనిల్, శ్రీకాంత్, దినేష్, ఇస్మాయిల్, సుస్మిత, స్వాతి, రాణి తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

**జహీరాబాద్:** పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఆగస్టు 1 నుంచి 3వ తేదీ వరకు పోచమ్మ, బాలమ్మ విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 1న నవగ్రహ పూజ, యంత్ర విగ్రహాల ధాన్యది వాసం పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 2న ఆయా దేవతల పూజ, విగ్రహాల సయ్యాది పుష్పాది వాసం, యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపన ఉంటుందన్నారు. 3న ఉదయం హనుమాన్ మందిరం నుంచి ఆలయం వరకు ఇంటింటి నుంచి బోనాల కార్యక్రమం జరుగుతుందని వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శించుకోవాలని కోరారు.

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సింధురెడ్డి

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని భారతినగర్ డివిజన్ కార్పొరేటర్ వి.సింధురెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం డివిజన్ పరిధిలోని మ్యాక్‌సొసైటీ, ఎల్‌ఐజీ, బొంబాయికాలనీల్లో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి అయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు తగ్గకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణాలను త్వరలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వి.ఆదర్శ్‌రెడ్డి, ఎల్‌ఐజీ కాలనీ అధ్యక్షుడు యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా వందల రోజుల ప్రణాళిక అమలు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

**సంగారెడ్డి :** సంగారెడ్డి మున్సిపాలిటీలో వంద రోజుల ప్రణాళిక పనులు పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. గురువారం ×సాక్షి₹ దినపత్రికలో ×స్వచ్ఛతకు దూరంగా..₹ అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అదనపు కలెక్టర్ స్పందించారు. ఈ మేరకు సంగారెడ్డి మున్సిపల్ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రతివార్డు ఆఫీసర్ ఉదయం ప్రతిరోజు వార్డులో పర్యటించి ఎప్పటికప్పుడు పనులు పర్యవేక్షించాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇళ్లను వేగవంతం చేసి అర్హులైన వారికి ఇల్లు అందేలా చొరవ చూపాలన్నారు. పారిశుద్ధ్య సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. సంగారెడ్డి పట్టణాన్ని స్వచ్ఛతగా తీర్చిదిద్ది ఆదర్శ పట్టణంగా తయారు చేయాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, వార్డు ఆఫీసర్స్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

**పటాన్‌చెరు:** డివిజన్ పరిధిలోని కృషి డిఫెన్స్ కాలనీలోని అభయాంజనేయ స్వామి దేవాలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, కాలనీ అధ్యక్షుడు అమరేందర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.